ఉక్రెయిన్‌కు నిఘా సమాచారం నిలిపివేత

అమెరికా అధ్యక్షుడు మరో షాక్

ఇప్పటికే సైనిక సాయం ఆపేసిన డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, మార్చి 6: ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని నిలిపివేసిన అమెరికా.. తాజాగా రష్యాకు సంబంధించిన నిఘా సమాచార మార్పిడిని కూడా నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. రష్యాతో శాంతి చర్చలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై ఒత్తిడి తెచ్చేందుకే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. అమెరికా తీసుకున్న తాజా నిర్ణయంతో రష్యాకు చెందిన వ్యూహాత్మక బాంబర్ విమానాల కదలికలు, విధ్వంసక క్షిపణుల ప్రయోగాలు ఉక్రెయిన్‌కు ఇక తెలిసే అవకాశం ఉండదు. గత శుక్రవారం అమెరికా అధ్యక్షుడికి, ఉక్రెయిన్ అధ్యక్షుడికి జరిగిన వాగ్యుద్ధం ఫలితంగా అమెరికా ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని నిలిపివేయగా తాజాగా నిఘా సమాచార మార్పిడి నిలిపివేతతో ఉక్రెయిన్ భారీగా ప్రాణనష్టాన్ని చవిచూసే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. గతంలో ఉక్రెయిన్‌కు బలమైన మద్దతుదారుగా ఉన్న అమెరికా తన వైఖరిని మార్చుకుని రష్యాతో రాజీమార్గంలో యుద్ధ సమస్యను పరిష్కరించడానికి చేస్తున్న ప్రయత్నాలు జెలెన్‌స్కీకి మింగుడుపడడం లేదు. అయితే సైనిక సాయం, నిఘా సమాచార మార్పిడిపై విధించిన నిషేధాలు తాత్కాలికమేనని, శాంతి చర్చలు పురోగతిని బట్టి వాటిని తొలగించడం జరుగుతుందని సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ బుధవారం వెల్లడించారు.

జెలెన్‌స్కీ ప్రత్యర్థులతో ట్రంప్ టీమ్ రహస్య చర్చలు

ట్రంప్ వెంట పర్యటనల్లో పాల్గొనే నలుగురు సీనియర్ సభ్యులు జెలెన్‌స్కీ రాజకీయ ప్రత్యర్థులతో రహస్యంగా చర్చలు జరిపినట్టు పొలిటికో పత్రిక బుధవారం వెల్లడించింది. ఉక్రెయిన్ ప్రతిపక్ష నాయకుడు యూలియా టైమోషెంకో, మాజీ అధ్యక్షుడు పెట్రో పోరోషెంకోకు చెందిన పార్టీలోని సీనియర్ సభ్యులతో ఈ చర్చలు జరిగినట్టు పత్రిక తెలిపింది. ఉక్రెయిన్‌లో వెంటనే అధ్యక్ష ఎన్నికలు జరిగే అవకాశంపై చర్చలు జరిగినట్టు ముగ్గురు ఉక్రెయిన్ పార్లమెంట్ సభ్యులను, అమెరికాకు చెందిన ఓ విదేశాంగ విధాన నిపుణుడిని ఉటంకిస్తూ పత్రిక పేర్కొంది.

ఉక్రెయిన్‌కు ఫ్రాన్స్ నిఘా సాయం

రష్యాకు చెందిన సైనిక నిఘా సమాచారాన్ని నిలిపివేస్తున్నట్టు అమెరికా ప్రకటించిన దరిమిలా ఉక్రెయిన్‌కు అండగా ఉంటామని ఫ్రాన్స్ ప్రకటించింది. తమ నిఘా వ్యవస్థ అత్యున్నతమైనదని, తమ నిఘా సమాచారాన్ని ఉక్రెయిన్ ఉపయోగించుకోవచ్చని ఫ్రాన్స్ రక్షణ మంత్రి సెబాస్టియన్ లెకార్ను వెల్లడించారు. అమెరికా సాయం నిలిచిపోవడంతో ఆ లోటును భర్తీ చేసేందుకు వివిధ రకాల ప్యాకేజీలను సత్వరమే ఉక్రెయిన్‌కు అందచేయవలసిందిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మాక్రాన్ తనను ఆదేశించినట్టు ఆయన చెప్పారు.

జెలెన్‌స్కీ స్వస్థలంపై రష్యా దాడులు

కీవ్, మార్చి 6: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణంలోని ఓ హోటల్‌పై రష్యా జరిపిన బాలిస్టిక్ క్షిపణి దాడిలో నలుగురు పౌరులు ప్రాణాలు కోల్పోయారని ఆ దేశ వైమానిక దళం తాజాగా తెలిపింది. బాలిస్టిక్ మిస్సైల్ ఇస్కందర్‌ను మధ్య ఉక్రెయిన్‌లోని కివియా రీహ్‌లో ఓ హోటల్‌పై రష్యా ప్రయోగించింది. క్షిపణి దాడికి కొద్ది గంటల ముందు మానవతా సహాయక సంస్థ వలంటీర్లు ఆ హోటల్‌లో దిగారని జెలెన్‌స్కీ చెప్పారు. ఉక్రెయిన్‌లోని వివిధ పట్టణాలపై రష్యా తాజాగా డ్రోన్, క్షిపణి దాడులతో విరుచుకుపడింది. 112 షాహెడ్, డెకాయ్ డ్రోన్లను, రెండు బాలిస్టిక్ ఇస్కందర్ మిస్సైల్స్‌ను ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానికదళం ప్రకటించింది.

భారతీయుల పిల్లలకు బహిష్కరణ ముప్పు!

- 21 ఏండ్లు దాటిన డిపెండెంట్లు వెళ్లవలసిందే
- అమెరికాను వీడాల్సిన స్థితిలో లక్షకుపైగా యువత
- ట్రంప్ విధానాలతో అగమ్యగోచరంగా భవిష్యత్తు

న్యూఢిల్లీ, మార్చి 6: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న దుందుడుకు నిర్ణయాలు యూఎస్‌లో నివసిస్తున్న లక్షలాది భారతీయుల్లో గుబులు రేపుతున్నాయి. అమెరికాలో వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తున్న ట్రంప్ యంత్రాంగం.. వీసా గడువు ముగిసినా ఇంకా తమ దేశంలోనే ఉంటున్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నది. హెచ్1బీ వీసాలున్న తల్లిదండ్రులతో పాటు మైనర్లుగా అమెరికా వెళ్లిన వారు ఇప్పుడు 21 ఏండ్లు నిండటంతో తిరిగి స్వదేశం రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. 21 ఏండ్లు దాటిన తరువాత వారిని డిపెండెంట్లుగా పరిగణించరు. ఇలాంటి భారతీయులు ప్రస్తుతం అమెరికాలో లక్షకుపైగా ఉన్నట్టు అంచనా. వీరందరూ ప్రస్తుతం బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు.

భవిష్యత్తు అగమ్యగోచరం..

21 ఏండ్లు దాటిన వీరి వీసా పునరుద్ధరణకు రెండేండ్ల గడువు ఉంటుంది. కానీ ఇటీవల ట్రంప్ ప్రభుత్వం ఇమ్మిగ్రేషన్ విధానంలో మార్పులు చేయడంతో వారి భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. హెచ్1బీ వీసా ఉన్న వీరి తల్లిదండ్రులు సైతం శాశ్వత నివాసం (గ్రీన్‌కార్డు) అర్హత పొందేందుకు ప్రస్తుత పరిస్థితిని బట్టి 12 నుంచి 100 ఏండ్ల సమయం పట్టవచ్చని అంటున్నారు. దీనికితోడు డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ (డీఏసీఏ) కింద వర్క్ పర్మిట్ల కోసం వచ్చే కొత్త దరఖాస్తులను అనుమతించరాదని టెక్సాస్‌కు చెందిన ఓ కోర్టు ఇటీవల రూలింగ్ ఇచ్చింది. దీంతో ఇప్పటివరకు డిపెండెంట్‌లు సహా సరైన పత్రాలు లేని వలసదారులకు రక్షణగా ఉన్న డీఏసీఏ నిబంధన ఇప్పుడు తొలగిపోయింది. ఇప్పుడు ఈ నిబంధన కూడా లేకపోవడంతో అమెరికాలోని భారతీయ యువత తప్పనిసరిగా స్వదేశానికో లేదా మరో ఇతర దేశానికో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. 2026 ఆర్థిక సంవత్సరం కోసం యూఎస్‌సీఐఎస్ ఇటీవల హెచ్1బీ వీసాల రిజిస్ట్రేషన్‌ను ప్రకటించింది. ఈ ప్రక్రియ ఈ నెల 7 నుంచి 24వరకు కొనసాగనుంది.

అక్రమ వలసదారుల తరలింపునకు మిలిటరీ విమానాలు వద్దని నిర్ణయం

అక్రమ వలసదారుల తరలింపునకు ఇక మిలిటరీ విమానాలు వినియోగించరాదని ట్రంప్ సర్కారు నిర్ణయించినట్టు సమాచారం. సీ-17, సీ-130 యుద్ధ విమానాల్లో అక్రమ వలసదారులను తరలించేందుకు భారీగా ఖర్చు అవుతున్నదని, దీంతో ఈ విమానాలను ఇక వినియోగించరాదని ప్రభుత్వం నిర్ణయించినట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అక్రమ వలసదారులతో చివరి మిలటరీ ఫ్లైట్ మార్చి 1న వెళ్లినట్టు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' కథనం తాజాగా తెలిపింది. అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఇండియాతోపాటు పెరూ, గ్వాటెమాల, హోండురాస్, పనామా, ఈక్వెడార్ తదితర దేశాలకు చెందిన అక్రమ వలసదారులను చేతలకు బేడీలు వేసి, కాళ్లకు గొలుసులు వేసి యుద్ధవిమానాల్లో వారి సొంత దేశాలకు పంపించి వేశారు.

రన్యారావు వెనక రాజకీయ నేత?

బెంగళూరు: సుమారు 14 కోట్ల రూపాయల బంగారాన్ని దుబాయి నుంచి స్మగ్లింగ్ చేస్తూ చిక్కిన కన్నడ నటి రన్యారావు ఉదంతంలో ఒక ప్రముఖ రాజకీయ నేత హస్తం ఉందన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి. తనకున్న రాజకీయ బంధాలు, సంబంధాలతో పనిలేకుండా చట్టం తన పని తాను చేసుకుని వెళ్తుందని సీఎం సిద్ధరామయ్య న్యాయ సలహాదారు పొన్నన్న వ్యాఖ్యలతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నటి ఇంట్లో దొరికిన ఆభరణాలు బెంగళూరులోని ఒక జ్యూయలరీ బొటిక్ నుంచి కొనుగోలు చేసినట్టు సమాచారం. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఒక ప్రముఖ రాజకీయ నేత తరపున వాటిని కొనుగోలు చేసినట్టు నిర్ధారించారు.

బొట్టు, తాళి ధరించకపోతే ఎలా?

నీ భర్త నీపై ఎందుకు ఆసక్తి చూపుతాడు?

మహిళకు జడ్జి ప్రశ్న

పుణె: మంగళసూత్రం ధరించని, బొట్టు పెట్టుకోని మహిళ పట్ల ఏ భర్త అయినా ఎందుకు ఆసక్తి చూపుతాడని పుణె జిల్లా జడ్జి ఓ మహిళను ప్రశ్నించారు. భర్త తనపై గృహ హింసకు పాల్పడినట్టు ఆ మహిళ చేసిన ఆరోపణలపై నడుస్తున్న కేసులో ఆ న్యాయమూర్తి మధ్యవర్తిగా వ్యవహరించారు. న్యాయవాది జహగిరిదర్ ఆ మహిళకు, జడ్జికి మధ్య జరిగిన సంభాషణను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఆ దంపతులిద్దరూ కొద్ది రోజుల క్రితమే విడిపోయారు. అయితే వారి సమస్యను సామరస్యంగా పరిష్కరించి ఇద్దరినీ కలిపేందుకు జడ్జి ప్రయత్నించారు. 'నీవు మంగళ సూత్రం ధరించలేదు. సింధూరం కూడా పెట్టుకోలేదు. పెండ్లయిన దానిలా ప్రవర్తించకుండా, వీటిని ధరించకుండా ఉంటే నీ భర్త నీ పట్ల ఎందుకు ఆసక్తి చూపాలి? అని జడ్జి ఆమెను ప్రశ్నించారు.

జైశంకర్ పర్యటనలో భద్రతా వైఫల్యం

కారును అడ్డుకోబోయిన ఖలిస్థాన్ మద్దతుదారులు

లండన్: భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ లండన్ పర్యటనలో తీవ్ర భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. ఆరు రోజుల యూకే, ఐర్లాండ్ పర్యటనలో భాగంగా జైశంకర్ లండన్‌లోని ఛాతమ్ హౌస్‌లో పలు సమావేశాల్లో పాల్గొని బుధవారం రాత్రి బయటకు వచ్చారు. అప్పటికే ఆ ప్రాంగణం బయట వేచి చూస్తున్న ఖలిస్థాన్ మద్దతుదారులు భద్రతా వలయాన్ని దాటుకొని కారుకు అడ్డంగా దూసుకొచ్చారు. కాగా, ఈ చర్యను భారత విదేశాంగ శాఖ ఖండించింది. యూకే ప్రభుత్వం వారి దౌత్య బాధ్యతలను నిర్వర్తించాలని కోరింది. ప్రజాస్వామ్య స్వేచ్ఛను ఆ శక్తులు దుర్వినియోగం చేయడం పట్ల విచారం వ్యక్తం చేసింది. ఖలిస్థాన్ మద్దతుదారుల చర్యను యూకే కూడా ఖండించింది. ఇలాంటి ఏ ప్రయత్నం అంగీకార యోగ్యం కాదని పేర్కొంది.

బందీలందరినీ విడిచిపెట్టండి.. లేకుంటే అంతుచూస్తా

హమాస్‌కు ట్రంప్ ఆఖరి హెచ్చరిక

వాషింగ్టన్, మార్చి 6: గాజాలో బందీలుగా ఉంచిన మిగిలిన బందీలందరినీ విడిచి పెట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌ను ఆఖరిసారి హెచ్చరించారు. హమాస్‌తో చర్చలు జరిపేందుకు తానొక ప్రతినిధి బృందాన్ని పంపానని బుధవారం ఆయన 'ట్రూత్'లో పోస్ట్ పెట్టారు. కొంత కాలం క్రితం హమాస్ చెర నుంచి విడుదలైన ఎనిమిది మంది బందీలను వైట్‌హౌస్‌లో కలుసుకున్న అనంతరం ఆయన ఈ పోస్ట్ చేశారు. 'ఇప్పుడే బందీలందరినీ విడిచిపెట్టండి. మీరు హత్య చేసిన బందీల శవాలను అప్పగించండి. లేకుంటే మీరు అంతమైపోతారు' అని ఆయన హమాస్‌ను తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

ఇజ్రాయెల్‌కు ఉపయోగపడేలా ట్రంప్ హెచ్చరికలు

బందీలందరినీ విడుదల చేయాలని ట్రంప్ చేసిన హెచ్చరికలు కాల్పుల విరమణ ఒప్పందం నుంచి ఇజ్రాయెల్ వెనక్కు మళ్లేందుకు ఉపయోగపడేలా ఉన్నాయని హమాస్ విమర్శించింది. 'మిగిలిన ఇజ్రాయెల్ ఖైదీలను విడుదల చేయడానికి ఉత్తమ మార్గం.. మధ్యవర్తుల సమక్షంలో సంతకం చేసిన ఒప్పందానికి కట్టుబడి ఉండి, దాంట్లోని రెండో దశ అమలు చేయడం' అని హమాస్ అధికార ప్రతినిధి గురువారం రాయిటర్స్ సంస్థకు సమాచారం అందించారు.

సుప్రీంకోర్టు జడ్జిగా జోయ్‌మాల్యా బాగ్చి

- కలకత్తా హైకోర్టు జడ్జికి పదోన్నతి
- కొలీజియం సిఫారసు

న్యూఢిల్లీ: కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిని సుప్రీంకోర్టు జడ్జిగా నియమించాలని కొలీజియం గురువారం సిఫారసు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల కొలీజియం ఈ సిఫారసు చేసింది. ఈ సిఫారసును కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే, ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆరేళ్లకుపైగా పని చేస్తారు. భారత ప్రధాన న్యాయమూర్తి పదవిని చేపట్టే అవకాశం కూడా ఉంటుంది.

ఛత్తీస్‌గఢ్‌లో అంతుచిక్కని వ్యాధి

30 రోజుల్లో 13 మంది మృతి

రాయ్‌పూర్, మార్చి 6: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో అంతుచిక్కని వ్యాధి ప్రజల ప్రాణాలను బలితీసుకుంటున్నది. బత్వాల్ గ్రామంలో నెల రోజుల వ్యవధిలో 13 మంది ఈ వ్యాధి బారిన పడి కన్నుమూశారు. ఎడతెరపి లేకుండా దగ్గు, ఛాతిలో నొప్పి లక్షణాలు మాత్రమే కనబడుతున్నాయి. అయితే ఈ మరణాలకు కారణమవుతున్న ఈ వ్యాధి ఏమిటో, దీని లక్షణాలు ఏమిటో ఇంతవరకు ఎలాంటి వివరాలు లభించ లేదని జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. తొలుత ఈ వ్యాధి జమ్ముకశ్మీర్‌లో, తర్వాత రాజస్థాన్‌లో విస్తరించి ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌కు చేరుకుందని చెప్పారు. మృతికి గల కారణాలను పరిశీలిస్తున్నామని అధికారులు తెలిపారు. వాతావరణంలో మార్పులు, మహువా పంట సేకరణ కారణం అయ్యిండొచ్చని భావిస్తున్నట్టు చెప్పారు.

అవినీతి అంతానికి నిందితుడి స్వేచ్ఛను హరించినా తప్పులేదు

కోర్టులకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: అవినీతిరహిత సమాజం కోసం నిందితుడి స్వేచ్ఛకు భంగం వాటిల్లినా న్యాయస్థానాలు వెనుకాడరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అవినీతి కేసులో ఓ ప్రభుత్వ అధికారికి ముందస్తు జామీను తిరస్కరిస్తూ పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది. అవినీతి అత్యంత ప్రమాదకరమైనదని అభిప్రాయపడింది. కొన్ని సందర్భాలలో నిందితుడి స్వేచ్ఛకు భంగకరమే అయినప్పటికీ సమాజ హితం కోసం కోర్టులు కఠిన నిర్ణయాలు తీసుకోకతప్పదని ధర్మాసనం పేర్కొంది. అవినీతి నిరోధక చట్టం, భారతీయ న్యాయ సంహిత కింద ఓ ప్రభుత్వ అధికారిపై నమోదైన కేసులో ముందస్తు జామీను ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఓ గ్రామ పంచాయతీలో అభివృద్ధి పనులపై ఆడిట్ విషయంలో ఆ అధికారి లంచం అడిగినట్టు నిందితుడిపై కేసు నమోదైందని ధర్మాసనం తెలిపింది. అవినీతి పరిమాణం గురించి ఆలోచించరాదని, దాని దుష్ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపింది.

ముంబైలో మరాఠీ మంటలు

- ఆర్‌ఎస్‌ఎస్ నేత వ్యాఖ్యలపై మరాఠాలు భగ్గు
- మరాఠీయే ముంబై భాష: సీఎం ఫడ్నవీస్
- భయ్యాజీపై రాజద్రోహం కేసు పెట్టాలి: ఉద్ధవ్



సురేశ్ భయ్యాజీ



ఉద్ధవ్ ఠాక్రే

ముంబై,మార్చి 6: మహారాష్ట్రలో భాషా వివాదం రాజుకుంది. ముంబైలో నివసించే వారు మరాఠీని తప్పనిసరిగా నేర్చుకోవలసిన అవసరం లేదంటూ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) సీనియర్ నాయకుడు సురేశ్ భయ్యాజీ జోషి చేసిన వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా శివసేన(యూబీటీ) శ్రేణులు నిరసనలు చేపట్టాయి. దీంతో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వెంటనే అప్రమత్తమయ్యారు. ముంబైతోపాటు మహారాష్ట్ర భాషగా మరాఠీని ఆయన అభివర్ణించారు. ఇక్కడ నివసించే ప్రతి ఒక్కరూ మరాఠీని నేర్చుకుని మాట్లాడి తీరవలసిందేనంటూ స్పష్టంచేశారు.

భయ్యాజీ ఏమన్నారంటే?

ముంబైలోని ఘట్‌కోపర్‌లో బుధవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న జోషి మాట్లాడుతూ ముంబైకు ఒకే భాష అంటూ ఏదీ లేదని చెప్పారు. ముంబైలోని వేర్వేరు ప్రాంతాలలో భిన్న భాషలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఘట్‌కోపర్ ప్రాంతంలో గుజరాతీ మాట్లాడతారని ఆయన అన్నారు. అందువల్ల ముంబైలో నివసించే వారంతా కచ్చితంగా మరాఠీ నేర్చుకోవలసిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే తన వ్యాఖ్యలపై వివాదం ఏర్పడడంతో జోషి గురువారం వివరణ ఇచ్చారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని ఆయన తెలిపారు. మరాఠీ భాష ముంబై, మహారాష్ట్రకు చెందినదని ఆయన చెప్పారు. ఇతర రాష్ర్టాల నుంచి వచ్చేవారు, ఇతర భాషలు మాట్లాడేవారు కూడా మరాఠీని అర్థం చేసుకోవడం అవసరమని జోషి తెలిపారు. తాను కూడా మరాఠీ వాడినేనని, ఇందుకు తాను గర్విస్తున్నానని ఆయన చెప్పారు.

ముంబైని చీల్చడానికి బీజేపీ కుట్ర: ఉద్ధవ్

జోషి వ్యాఖ్యలపై మాజీ ముఖ్యమంత్రి, శివసేన(యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే గురువారం తీవ్రంగా స్పందించారు. విధాన్ భవన్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ జోషి వ్యాఖ్యల వెనుక ఆర్‌ఎస్‌ఎస్ రహస్య అజెండా ఉందని ఆయన ఆరోపించారు. ముంబైని చీల్చడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఆయన ఆరోపించారు. ఇవే మాటలు గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో అని క్షేమంగా వెనక్కు రాగలరా అంటూ జోషిని ఠాక్రే సవాలు చేశారు. మరాఠీ మనుషులు స్వాగతిస్తున్నారని ఏది పడితే అది మాట్లాడితే ఇక్కడ ఎవరూ సహించరని హెచ్చరించారు. జోషిపై దేశద్రోహం కేసును నమోదు చేయాలని ఆయన డిమాండు చేశారు. జోషి వ్యాఖ్యలకు నిరసనగా దక్షిణ ముంబైలోని హుతాత్మ చౌక్ వద్ద ప్రతిపక్ష ఎంవీఏ నాయకులు ధర్నా చేశారు.

మరాఠీ నేర్చుకోవాల్సిందే: ఫడ్నవీస్

జోషి వ్యాఖ్యలపై ప్రభుత్వ వైఖరి ఏమిటని శివసేన(యూబీటీ) ఎమ్మెల్యే భాస్కర్ జాదవ్ గురువారం అసెంబ్లీలో ప్రశ్నించగా ముఖ్యమంత్రి ఫడ్నవీస్ జవాబిస్తూ భయ్యాజీ వ్యాఖ్యలేమిటో తనకు తెలియదని, అయితే ముంబైలో, మహారాష్ట్రలో నివసించే వారంతా తప్పనిసరిగా మరాఠీ నేర్చుకుని, మాట్లాడి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. మీ మాతృభాషను మీరు ప్రేమించి, గౌరవిస్తే ఇతర భాషల పట్ల కూడా మీరు అలాగే వ్యవహరిస్తారు అని ఫడ్నవీస్ చెప్పారు. తన మాటలతో జోషి కూడా ఏకీభవిస్తారని ఆశిస్తున్నట్టు ఆయన అన్నారు. అయితే శివసేన(యూబీటీ) రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్ ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేత భయ్యాజీ వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఇది దేశద్రోహమేనని, మహారాష్ట్రను అవమానించడమేనని రౌత్ ఆరోపించారు.

సమానత్వం కోరడం భాషా దురభిమానం కాదు

స్టాలిన్ హితవు

చెన్నై, మార్చి 6: భాషాపరమైన సమానత్వాన్ని కావాలని డిమాండు చేయడం భాషా దురభిమానం కాదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వ్యాఖ్యానించారు. అసలైన దురభిమానులు, జాతి వ్యతిరేకులు హిందీ ఉన్మాదులని, తమ హక్కులు సహజమని, ప్రతిఘటన దేశద్రోహమని వారు భావిస్తారని ఆయన చెప్పారు. తమిళనాడులో తమిళ భాషకు సరైన స్థానం దక్కాలని తాము కోరితే దాన్ని నేరంగా పరిగణిస్తూ తమపైన భాషాదురభిమానులు, జాతి వ్యతిరేకులంటూ ముద్ర వేస్తున్నారని ఓ సోషల్ మీడియా పోస్టులో ఆయన పేర్కొన్నారు. గాడ్సే సిద్ధాంతాన్ని గొప్పగా చెప్పుకునే వ్యక్తులే చైనా దురాక్రమణ, బంగ్లాదేశ్ విముక్తి పోరాటం, కార్గిల్ యుద్ధ కాలాలలో అత్యధిక విరాళాలను అందచేసిన డీఎంకే ప్రభుత్వంపై నిందలు చేస్తున్నారని ఆయన పరోక్షంగా బీజేపీపై ధ్వజమెత్తారు. వారి సైద్ధాంతిక ముత్తాతలలో ఒకరు బాపూజీని హత్య చేశారని ఆయన ఎద్దేవా చేశారు. దురభిమానమంటే ..మూడు క్రిమినల్ చట్టాలు తమిళ ప్రజలకు ఒక్క ముక్క కూడా పలకలేని, అర్థం కాని భాషలో ఉండడమేనని ఆయన పేర్కొన్నారు. దేశానికి అత్యధికంగా నిధులు అందచేస్తున్న రాష్ర్టాన్ని ద్వితీయ శ్రేణి పౌరులుగా చూడడాన్నే దురభిమానం అంటారని ఆయన తెలిపారు. తమకు రావాలసిన న్యాయమైన వాటాను ఇవ్వకపోవడమే దురభిమానమని స్టాలిన్ పేర్కొన్నారు.

సివిల్ ఇంజినీర్ల తప్పిదాలతోనే రోడ్డు ప్రమాదాలు: గడ్కరీ

న్యూఢిల్లీ, మార్చి 6:దేశంలో రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్య పెరుగుదలకు సివిల్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లు తయారుచేసిన నాసిరకం డీపీఆర్‌లు, లోపభూయిష్టమైన రోడ్డు డిజైన్లే కారణమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నిందించారు. గురువారం నాడిక్కడ గ్లోబల్ రోడ్ ఇన్‌ఫ్రాటెక్ సమ్మిట్, ఎక్స్‌పో(జీఆర్ఐఎస్)లో ఆయన ప్రసంగిస్తూ దేశంలో రోడ్డు భద్రతా చర్యలను మెరుగుపరచవలసిన తక్షణావసరం ఉందని స్పష్టం చేశారు. చిన్న చిన్న సివిల్ పొరపాట్లు, లోపభూయిష్టమైన డీపీఆర్‌ల కారణంగానే ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకు ఎవరినీ బాధ్యులను చేయలేమని గడ్కరీ అన్నారు. రోడ్డు భద్రతను పెంచడానికి కొత్త వ్యూహాలను రూపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. మన దేశంలో రోడ్డు సూచికలు, మార్కింగ్ విధానాలు వంటి చిన్న విషయాలు కూడా చాలా నాసిరకంగా ఉన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్పెయిన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్ వంటి దేశాల నుంచి మనం చాలా నేర్చుకోవలసింది ఉందని చెప్పారు. దేశంలో అత్యంత చెత్త డీపీఆర్‌లు తయారవుతున్నాయని, ఇందుకు ఇంజనీర్లే ప్రధానంగా బాధ్యులని గడ్కరీ చెప్పారు. నాసిరకం ప్లానింగ్, డిజైన్ కారణంగానే రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

రియల్ ఎస్టేట్, రాజకీయ చర్చలొద్దు!

కస్టమర్లకు బెంగళూరు హోటల్ వినతి

బెంగళూరు, మార్చి 6: కొన్ని హోటళ్ల ప్రత్యేకమైన నిబంధనలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందుతాయి. బెంగళూరులోని 'పాకశాల' అనే రెస్టారెంట్ కస్టమర్లకు చేసిన అలాంటి ఓ సూచన ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. 'ఈ సౌకర్యం భోజనం చేయడానికి మాత్రమే. రియల్ ఎస్టేట్, రాజకీయాల గురించి చర్చించడానికి కాదు. దయచేసి అర్థం చేసుకొని సహకరించండి' అన్న ఆ హోటల్ సూచిక బోర్డ్‌ను ఎక్స్‌లో ఓ యూజర్ పోస్ట్ చేయగా మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఓ యూజర్ తన అనుభవాన్ని పేర్కొంటూ.. 'రాజకీయాల గురించి చర్చ పక్కదారి పడుతుంది. వచ్చినవాళ్లు కేవలం కాఫీ ఆర్డర్ చేసి గంటల కొద్దీ రాజకీయాలు, రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడతారు. ఇది హోటల్ వాళ్ల వ్యాపారంపై ప్రభావం చూపుతుంది' అని అన్నారు. ఇలాంటి సూచిక బోర్డులు బెంగళూరులో సాధారణమేనని కొందరు కామెంట్ చేశారు. కొందరు యూజర్లు హోటల్ వాళ్ల నిబంధనను సమర్థించగా, కొందరు అంగీకరించ లేకపోయారు. 'మనం ఏం చర్చించుకుంటున్నామో వాళ్లకెలా తెలుస్తుంది?' అని ఓ యూజర్ సందేహం వ్యక్తం చేశారు!

ఆర్జీవీపై నాన్ బెయిలబుల్ వారంట్

ముంబై: ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు ముంబైలోని సెషన్స్ కోర్టు ఈ నెల 4న నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేసింది. చెక్ బౌన్స్ కేసులో జైలు శిక్షను నిలిపివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను తిరస్కరించింది. తదుపరి విచారణను జూలై 28కి వాయిదా వేసింది. కోర్టుకు హాజరైన తర్వాత బెయిలు కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. వర్మ నేరానికి పాల్పడినట్టు అంధేరీలోని ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ జనవరి 21న తీర్పు చెప్పారు.

భారత్‌కు అప్పగిస్తే చిత్రహింసలు పెడతారు!

కోర్టులో తహవూర్ పిటిషన్

న్యూఢిల్లీ: తనను భారత్‌కు అప్పగించడంపై అత్యవసరంగా స్టే విధించాలని 2008 ముంబై ఉగ్ర దాడుల నిందితుడు తహవూర్ రాణా అమెరికా సుప్రీంకోర్టును కోరాడు. తన జాతి, మత, సామాజిక గుర్తింపు కారణంగా భారతదేశంలో తనను చిత్రహింసలు పెట్టి చంపేస్తారంటూ అతను తన పిటిషన్‌లో ఆరోపించాడు. తాను పాకిస్థానీ సంతతికి చెందిన ముస్లింనని, తాను పాకిస్థానీ సైన్యానికి చెందిన మాజీ సభ్యుడినని అతను తెలిపాడు. ఈ కారణంగానే కస్టడీలో తనను చిత్రహింసలు పెడతారని అనుమానించవలసి వస్తోందని, తనను ప్రమాదకర పరిస్థితిలోకి నెట్టవద్దని కోర్టును అభ్యర్థించాడు.

ఇద్దరు కేరళీయులకు యూఏఈలో ఉరిశిక్ష

న్యూఢిల్లీ: ఇద్దరు భారతీయులకు రెండు వేర్వేరు కేసుల్లో యూఏఈలో మరణశిక్ష అమలైంది. ఈ విషయాన్ని భారత విదేశాంగ శాఖ గురువారం వెల్లడించింది. ఉరిశిక్షకు గురైన ఇద్దరిని కేరళకు చెందిన ముహమ్మద్ రినాశ్ అరన్‌గిలోత్తు, మురళీధరన్ పెరుమ్‌త్తట్ట వలప్పిల్‌గా గుర్తించింది. ముహమ్మద్ ఓ యూఏఈ పౌరుడిని, మురళీధరన్ ఓ భారతీయుడిని హత్య చేసిన కేసులో దోషులుగా తేలారని తెలిపింది. వీరి మరణ శిక్షల గురించి యూఏఈ గత నెల 28న భారత దౌత్య కార్యాలయానికి సమాచారం అందించింది. దౌత్య కార్యాలయం క్షమాభిక్ష పిటిషన్ దాఖలు చేసినా ప్రయోజనం లేకపోవడంతో దోషులకు ఊరి శిక్ష అమలైంది.

భూగర్భంలో భారీ రిజర్వాయర్!

భూ ఉపరితలంపై ఉన్న జలాలతో పోలిస్తే మూడింతలు అధికంగా నీరు

న్యూయార్క్: భూగర్భంలో భారీ రిజర్వాయర్ ఉన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. భూ ఉపరితలం నుంచి సుమారు 400 మైళ్ల లోతుల్లో భూ పొరల్లో రింగ్‌వుడైట్ అనే ఖనిజంలో ఇది నిక్షిప్తమై ఉంది. ఈ మేరకు అమెరికాలోని కొలరాడోకు చెందిన భూభౌతిక శాస్త్రవేత్త స్టీవ్ జాకబ్‌సెన్ వెల్లడించారు. భూగర్భంలో కనుగొన్న ఈ వాటర్ సైకిల్ (జల చక్రం) భూ ఉపరితలంపై ఎక్కువ భాగం నీరు ఎందుకు ఉన్నదో తెలియజేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. భూకంప తరంగాలపై అధ్యయనం చేసే క్రమంలో ఈ భారీ రిజర్వాయర్‌ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

నాలుగో రూపంలో నిల్వ!

ఈ రిజర్వాయర్‌లోని నీరు ఘన, ద్రవ, వాయు రూపాల్లో కాకుండా, నాలుగో రూపంలో నిల్వ ఉన్నట్టు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నీటిని స్పాంజి పీల్చినట్టు.. ఈ నీరు మాంటిల్ రాక్‌లోని రింగ్‌వుడైట్ ఖనిజంలో నిక్షిప్తమై ఉన్నట్టు భావిస్తున్నారు. భూపొరల్లోని 1 శాతం రింగ్‌వుడైట్ నీటిని గ్రహించి ఉందని అనుకుంటే.. అది అన్ని మహాసముద్రాల్లోని నీటి కంటే మూడు రెట్లు ఎక్కువ ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. భూమి అన్ని పొరల్లో నీటిజాడలు ఉన్నట్టు శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు.



108 ఏండ్లొచ్చినా 'కత్తెర' వదల్లేదు!

జపాన్ బామ్మ గిన్నిస్ రికార్డ్

టోక్యో: జపాన్‌కు చెందిన క్షురకురాలు షిట్స్యు హకోయిషి(108) బుధవారం ప్రపంచంలోనే అత్యంత వృద్ధ క్షురకురాలిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ధ్రువీకరణ పత్రం పొందింది. హకోయిషి 14వ ఏట క్షురకురాలు కావాలనుకొని టోక్యోకు వలస వచ్చారు. తన 20వ ఏట ఆమె క్షురక వృత్తి లైసెన్స్ పొందారు. అప్పుడే భర్తతో కలిసి ఒక సెలూన్ ప్రారంభించారు.